క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేత



పెద్దేవం హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్న తోట, ఎంఈవో

తాళ్లపూడి: పదో తరగతిలో విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నుంచి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్ నెహ్రూజీ, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగేంద్రరావు, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నామా కుటుంబానికి తలారి పరామర్శ



నామా శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లపూడి: పితృ వియోగంతో బాధ పడుతున్న మండలంలోని తాడిపూడి సర్పంచ్ నామా శ్రీనివాస్‌ను గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు పరామర్శించారు. నామా శ్రీనివాస్ తండ్రి నామా కృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో తాడిపూడిలో నామా శ్రీనివాస్‌ను పరామర్శించి అతని కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, పార్టీ నాయకులు సిర్రా గంగారావు, కంఠమని రమేష్, ఉప్పులూరి సూరిబాబు, వనిమిరెడ్డి శ్రీనివాస్, యాళ్ల బాబూరావు, ఎల్లిన శ్రీను, మెట్టి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న కుటుంబ సభ్యులకు పరామర్శ



వెంకన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ ఆవపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్యుత వెంకటస్వామి సోదరుడు, పార్టీ నాయకుడు వెంకన్న ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను పార్టీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, నేతలు మేణ్ని యువరాజు, ముప్పిడి వెంకటరత్నం, చెల్లారి రామ శ్రీనివాస్, ప్రగడ వెంకటేశ్వరావు, అచ్యుత వీరన్న, జో గినీడి నాగేశ్వరావు గురువారం పరామర్శించారు.

రమణ మృతికి సంతాపం



సింగవరంలో రమణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

నిడదవోలు రూరల్: మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ డైరెక్టర్ వెలిచేటి గౌతమ్ తండ్రి రమణ ఇటీవల మృతి చెందడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు గురువారం సంతాపం వ్యక్తం చేశారు. రమణ చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు నివాళులర్పించారు. పార్టీ బూత్ కన్వీనర్ గరికిపాటి శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: త్యాజంపూడి సబ్ స్టేషన్ పరిధిలోని పట్టింపాలెం ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నారు. ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఈ విషయం తెలిపారు. త్యాజంపూడి, నట్టింపాలెం, కురుకూరు గ్రామాల పరిధిలోని ఫీడర్‌పై వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 నుంచి 9 గంటల వరకూ, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా ఉంటుందని వివరించారు.

నిడదవోలు: పట్టణంలో గాంధీనగర్ 11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల నరికివేత పనుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గాంధీనగర్, రాయిపేట, ఇందిరానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రాత బాగుంటేే.. మార్కుల మోత

- టెన్త్ విద్యార్థులు దస్తూరిపై దృష్టి పెట్టాలి
- ముత్యాల్లాంటి అక్షరాలతో మరిన్ని మార్కులు
- ఉపాధ్యాయుల సూచన



దూబచర్ల హైస్కూలులో దస్తూరీ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

నల్లజర్ల: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థుల ధ్యాసంతా చదువు పైనే ఉంటోంది. చేతి రాతపై దృష్టి పెడుతున్న వారు కొద్ది మందే ఉంటున్నారు. చదువుతో పాటు చేతి రాతపై కూడా దృష్టి పెడితే మంచి మార్కులు సాధించవచ్చునని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. పరీక్షల్లో సమాధానాలు ఉన్నది ఉన్నట్టు రాసినా.. దస్తూరీ ఎంత బాగా ఉందన్నదే ముఖ్యం. ఏం రాశామన్నది పేపరు మూల్యాంకనం చేసే వ్యక్తికి అర్థమైతే ఎక్కువ మార్కులు వేసేందుకు అవకాశం ఉంటుంది. ఏడాది పాటు చదివిన అంశాలను రెండున్నర గంటల్లో ఆన్సర్ షీట్‌పై పెట్టాలి. దీంతో పరీక్షల సమయంలో సహజంగానే విద్యార్థుల్లో ఆందోళన ఉంటుంది.

మొదటి ప్రశ్నకు సమాధానం చక్కగా రాసి, తర్వాత వేగం పెరిగి కొందరు అందంగా రాయలేక పోతూంటారు. దీనిని అధిగమించాలంటే ముందుగానే దస్తూరిపై సాధన చేస్తే పరీక్షల్లో ఇబ్బందులు ఉండవని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఆణిముత్యాల్లాంటి అక్షరాల కోసం కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటించాలని దూబచర్ల జెడ్పీ హైస్కూలు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాసరావు చెప్పారు. తమ స్కూలులోని విద్యార్థులకు అక్షరాలు అందంగా రాయడానికి ముందు నుంచీ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

ఈ జాగ్రత్తలు మేలు

- సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండటంతో పాటు అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు ఒకటికి రెండు మార్కులు అదనంగా వేసే అవకాశం ఉంటుంది.
- పేజీ పైభాగంలోను, ఎడమ వైపు ఒక అంగుళం మార్జిన్ విడిచి పెట్టాలి.
- సామాన్య, భౌతిక శాస్త్రాల్లో బొమ్మలు గీసి, భాగాలు గుర్తించే విషయంలో పెన్ను ఒత్తి పెట్టి రాయకూడదు. ఇలా చేస్తే పేపర్ వెనుక అసహ్యంగా కనిపిస్తుంది.
- పేజీలో వాక్యాలు పైనుంచి కిందకు లేదా పైకి ఉండకుండా వరుస క్రమంలో ఉండాలి.
- పేజీకి 16 నుంచి 20 లైన్లు మించి రాయకూడదు.
- రోజూ కొద్దిసేపు సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- పెన్ను సక్రమంగా పట్టుకొని రాస్తే.. రాసే అక్షరాలు అందంగా.. గుండ్రంగా ఉంటాయి.
- జవాబులు రాసేటప్పుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకూ నిటారుగా కూర్చుని రాయడం మంచిది.
- అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగినంత ఖాళీ ఉండాలి.

చేతిరాతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే..



శాస్త్ర, సాంకేతిక రంగం ఎంత ఎదిగినా చేతిరాతకు ప్రాధాన్యం పెరుగుతూనే ఉంది. సంబంధిత భాషపై పట్టు ఉంటే రాయడం తేలిక అవుతుంది. దస్తూరీ బాగున్న విద్యార్థులు అదనంగా మార్కులు పొందే అవకాశం ఉంటుంది. మా పాఠశాలలోని విద్యార్థులకు ఈ తరహా తర్ఫీదు ఇస్తున్నాం.

– బి.సుమతి, ప్రధానోపాధ్యాయిని, జెడ్పీ హైస్కూలు, దూబచర్ల

అదనపు మార్కులు సొంతం



అదనపు మార్కులకు చేతిరాత చాలా ముఖ్యం. చేతి రాతను బట్టి విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేయవచ్చు. పాఠశాల సముదాయ సమావేశాల్లో ఇదే విషయాన్ని అధికారులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థి రాసే సమాధానం ద్వారా అతని వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు. దస్తూరీ బాగుంటే మంచి మార్కులు వస్తాయి. మానసిక ఒత్తిడితో రాయకూడదు. చేతిరాత బాగుంటే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– బొందల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూలు, దూబచర్ల

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి



ఛాత్రోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంవీఐ శివప్రసాద్

నల్లజర్ల: ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలు పాటించి, ప్రమాదాలు నివారించాలని కొవ్వూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) కేవీ శివప్రసాద్ విద్యార్థులకు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా దూబచర్లలోని జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో ఛాత్రోపాధ్యాయులతో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రాణం ఎంతో విలువైనదని, ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదంలో మరణించకూడదని అన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బైక్‌లు నడుపుతూ విద్యార్థులు ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. బస్సులు నడుస్తున్నప్పుడు ఎక్కడం, దిగడం చేయకూడదన్నారు. ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నేరాలకు పాల్పడరాదని చెప్పారు. ముఖ్యంగా విద్యా సంస్థల్లో పని చేసే డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని, పరిమితికి మించి విద్యార్థులను అనుమతించరాదని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ గాని, అధిక వేగంతో గాని బస్సులు నడపరాదన్నారు. మూడు నెలలకొకసారి డ్రైవర్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలని శివప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్ఆర్ సుబ్రహ్మణ్యం, సీఐ పి.విజయశంకర్ కూడా పాల్గొన్నారు.

పట్టణంలో మంత్రి సుడిగాలి పర్యటన



పట్టణంలో కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు: పట్టణంలో గురువారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సుడిగాలి పర్యటన చేశారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన సమిశ్రగూడెం పురాతన ఐరన్ బ్రిడ్జిను పరిశీలించారు. పురాతన వంతెనకు సగభాగం రెయిలింగ్ లేకపోవడంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారీ వాహనాలను అనుమతించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

అనంతరం పట్టణంలో గాంధీనగర్ మాలకోడు చెరువు, తీరుగూడెంలో టిడ్కో గృహ సముదాయం, సంత మార్కెట్‌లో మంచినీటి సరఫరా స్కీమ్, మార్కెట్ యార్డ్ అభివృద్ధి, మున్సిపల్ షాపింగ్ మాల్ పనులు, వైఎస్సార్ కాలనీలో హౌసింగ్ లే-అవుట్లను పరిశీలించారు. డంపింగ్ యార్డ్, చినకాశి రేవులో పుష్కర నది పార్క్ అభివృద్ధి, ఆలయ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. సంజీవయ్యనగర్‌లో పార్క్ అభివృద్ధి పనులు పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ, ఏఈ హేమంత్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

ప్రకృతి మహిమ



అన్నవరప్పాడులో వేంకటేశ్వరస్వామి ఆలయం



ఖండవల్లి వద్ద హైవేపై లైట్లు వేసుకుని వస్తున్న బస్సు



అన్నవరప్పాడులో అంతంతమాత్రంగా కనిపిస్తున్న సూర్యుడు

పెరవలి: నిత్య శ్రామైక సౌందర్యం మంచు తెరల చాటున ద్విగుణీకృతమవుతోంది. బారెడు పొద్దెక్కినా.. భగభగమండే సూరీడు కూడా.. చందమామలా కనువిందు చేస్తున్నాడు. దట్టమైన పొగమంచు ప్రజలను ఇబ్బంది పెడుతున్నా.. ఆ ప్రకృతి సౌందర్యానికి మాత్రం తన్మయులవుతున్నారు. మండలంలోని అనేక గ్రామాల్లో మంచు వర్షం కురుస్తున్నదా అన్నట్లుగా గురువారం ఉదయం 9 గంటలైనా సూర్యుని జాడ కనిపించలేదు. ప్రజలంతా పొగమంచు తెరల చాటునే తమ దైనందిన కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. జాతీయ రహదారిపై వాహనాలు ఉదయం 9 గంటలు దాటినా లైట్లు వేసుకునే ప్రయాణించాయి. ఆలయాలు, పచ్చని పొలాలు సుందర దృశ్యాన్ని ఆవిష్కరించాయి. మహిళలు, యువతులు పొగమంచును లెక్కచేయకుండా ఆరుబయటే పూజలు నిర్వహించారు. వ్యవసాయదారులు, కూలీలు పొగమంచులోనే శ్రమపడడం కనిపించింది.



పిట్టల వేమవరం వద్ద హైవేపై సైకిళ్లపై వస్తున్న రైతులు



కడింపాడు వద్ద హైవేపై మోటార్ సైకిల్‌పై చేపల వ్యాపారి

లారీ ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది ఆందోళన

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట సమీపంలో ఫ్యాక్టరీల వద్ద లారీ ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది గురువారం ఆందోళన చేశారు. స్థానికంగా టాటా వాటర్ బాటిళ్లను తయారు చేస్తున్న అరుణ జ్యోతి బయోవెంచర్స్ ఫ్యాక్టరీ సమీపంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌పోర్టు లారీ యజమానులు దుగ్గిరాల మురళి, చాపల కిషోర్ మాట్లాడుతూ ప్రైవేట్ కాంట్రాక్ట్ సంస్థ ద్వారా సరకు రవాణా చేసేందుకు అనిష్ లాజిస్టిక్స్, విష్ణు ట్రాన్స్‌పోర్ట్ నుంచి స్థానిక దుర్గాదేవి మినీ ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది సబ్ కాంట్రాక్ట్ పై సుమారు ఏడాదిన్నరగా 10 లారీలపై సరకు రవాణా చేస్తున్నామన్నారు. ఇటీవల ఆ కాంట్రాక్ట్ సంస్థలు సొంత లారీలు పెట్టుకుని తమ ట్రాన్స్ పోర్ట్ లారీలను నిర్లక్ష్యం చేస్తూ పని చెప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ కాంట్రాక్ట్‌ను నమ్ముకుని కొత్తగా లారీలు కొన్నామని, ఇప్పుడు పని చెప్పకపోవడంతో భారీగా నష్ట పోతున్నామన్నారు. యాజమాన్యం తమతో చర్చించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దుర్గాదేవి మినీ ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది పినిశెట్టి నరేష్, జొన్నకుటి రాజేష్, కరిబండి రాజు, తిగిరిపల్లి వెంకటేష్, పినిశెట్టి మణి పాల్గొన్నారు.



అన్నదేవరపేట సమీపాన గోపవరం రోడ్డులో ఆందోళన చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది

ఉచిత పశు వైద్య శిబిరం

కొవ్వూరు: మండలంలోని ఆరికిరేవులలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువుల్లో నట్టల నివారణ, లంపి స్కిన్, గొంతు వాపు, కొక్కెర వ్యాధులు రాకుండా టీకాలు వేసినట్లు పశువైద్యురాలు డాక్టర్ గిరీష తెలిపారు. పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. గ్రామానికి చెందిన 26 మంది రైతులకు చెందిన 31 లేగదూడలను ఈ పదర్శనకు తీసుకువచ్చారు. పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.వెంకటరెడ్డి లేగదూడల ప్రదర్శనను తిలకించారు. పశు వైద్యులు కేఎస్‌వీ చంద్రమౌళి, డాక్టర్ సోమశేఖర్, కృషి విజ్ఞాన కేంద్రం కలవచర్ల వైద్యులు డాక్టర్ నాగేశ్వరరావు రెడ్డి మేలు జాతి లక్షణాలు, సంపూర్ణ పోషక విలువలు కలిగిన మూడు లేగ దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. మిగిలిన రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సర్పంచ్ మట్టా శ్రీనివాస్, ఎంపీటీసీ అల్లూ వెంకట రమణ, నాయకులు చావా శ్రీనివాసరావు, యనమదల శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కొండపాడులో..

చాగల్లు: మండలంలోని మర్కొండపాడులో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి ముఖేష్ పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 92 పశువులు, 48 దూడలు, 129 కోళ్లకు నట్టల నివారణ మందులు అందజేశారు. పశువులకు లంపి చర్మవ్యాధి, గొంతువాపు వ్యాధి, కొక్కెర వ్యాధుల నివారణ టీకాలు వేశారు. పశువులకు బాహ్య పరాన్న జీవుల నిర్మూలన, గర్భకోశ వ్యాధులు, చూడు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సిబ్బంది శ్రీలత, నాగేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న, అంబేడ్కర్, గౌతమ్ పాల్గొన్నారు.

ఆకుకూరల పంపిణీ

ఉండ్రాజవరం: చిలకపాడులో గురువారం గర్భిణులకు, బాలింతలకు సర్పంచ్ టి.సూర్యకుమారి, ఎంపీటీసీ టి.నాగపార్వతి ఆకు కూరలను అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది నిర్వహించే పోషణ వాటిక మొక్కల పెంపకంలో భాగంగా కార్యక్రమం నిర్వహించినట్టు వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఇర్ఫాన్ తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఉండ్రాజవరం: పోటీ ప్రపంచంలో విద్యార్థులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మానవత రాష్ట్ర కన్వీనర్ కోడూరి రాధాపుష్పవతి అన్నారు. సంస్థ మండల అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు ఆధ్వర్యంలో వడ్లూరు, సూర్యారావుపాలెం ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గురువారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్మన్ బోయపాటి రామలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. టెన్త్ తరువాత ఏ కోర్సుల్లో చదవాలో అవగాహన కల్పించారు. తణుకు మండల అధ్యక్షురాలు కఠారి శారదాదేవి మాట్లాడుతూ, దైనందిన జీవితంలో క్రమశిక్షణ పాటిస్తే ఉన్నత స్థానం అధిరోహించవచ్చన్నారు. అనంతరం టెన్త్ మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సర్పంచ్‌లు రఘుమండ తేజశ్రీ, మెండే లలితకుమారి, గ్రామ పెద్దలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

వెటర్నరీ ఏడీగా చెన్నకేశవులు



ఏడీ చెన్నకేశవులును అభినందిస్తున్న సిబ్బంది

గోపాలపురం: వెటర్నరీ ఏడీగా ఇ.చెన్నకేశవులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నెల్లూరు జిల్లా కందుకూరు మండలం నుంచి ఇక్కడికి పదోన్నతితో బదిలీపై వచ్చారు. ఆయనను వెటర్నరీ డాక్టర్లు ఎం.ధరణ్‌బాబు, తాళ్లపూడి డాక్టర్ కె.బాలాజీ శేఖర్, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

వైభవంగా నంగాలమ్మ గరగోత్సవం



నంగాలమ్మ అమ్మవారి గరగలు ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

నిడదవోలు: సంక్రాంతి సందర్భంగా పట్టణంలో నంగాలమ్మ అమ్మవారి పూరిగుడి వద్ద 11వ రోజు గురువారం గుడ్ల వంశీయుల ఆధ్వర్యంలో అమ్మవారి గరగోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు గరగలను ఎత్తుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలో 26వ వార్డు, కోట దిబ్బ ప్రాంతాల్లో నంగాలమ్మ తల్లి గరగలను డప్పు వాయిద్యాల మధ్య ఊరేగారు. కౌన్సిలర్ తోలేటి ఝాన్సీ ఇంటి వద్ద అమ్మవారికి మంగళహారతులు, పసుపు కుంకుమతో పాటు, చీరలను సమర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, పువ్వల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్, అహ్మదున్నీసా బేగం, తోలేటి కోటేశ్వరరావు, ఆలమూరి రాజ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

కొవ్వూరు: కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బచ్చు బుజ్జిబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తయినప్పటికీ ఇప్పటి వరకూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 25న ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టే నిరసనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టడంతో పాటు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ ఆందోళన చేపడుతున్నట్టు తెలిపారు. పార్టీ నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరా నేడు నిలిపివేత

ఉండ్రాజవరం: స్థానిక 33 కేవీ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మార్చుతున్నందున మండలంలోని ఉండ్రాజవరం, తాడిపర్రు, వెలగదుర్రు, చిలకపాడు, సత్యవాడ గ్రామాలకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

కొవ్వూరు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 25న నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆర్డీవో చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్ తెలిపారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామ్మోహన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ వై.రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



జిల్లా జూనియర్ లెక్చరర్స్ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇంటర్ రీజినల్ డైరెక్టర్ శారద, సంఘ నాయకులు

కొవ్వూరు: జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించినట్లు కొవ్వూరుకు చెందిన ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు అయినపర్తి మురళీకృష్ణ తెలిపారు. రాజమహేంద్రవరంలో ఇంటర్‌మీడియెట్ ఎడ్యూకేషన్ రీజినల్ డైరెక్టర్ ఐ.శారద క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు చెప్పారు. ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని ఆమె సూచించారు. ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్ఎస్‌వీ నరసింహ, జిల్లా సంఘ కార్యదర్శి డి.మోహన్, ఉపాధ్యక్షులు ఎస్.రాంబాబు, కోశాధికారి యు.వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిలర్ కె.మౌనిక పాల్గొన్నారు.

నిడదవోలు: ఏపీ రాష్ట్ర ప్రభుత్వ దివ్యాంగ ఉద్యోగ సంఘ క్యాలెండర్‌ను పట్టణంలో గురువారం రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. దివ్యాంగ ఉద్యోగులు ఎదుర్కొనే సమస్యలతో పాటు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియలో దివ్యాంగ ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయులు మంత్రిని కోరారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఆచంట సత్యనారాయణ, ప్రతినిధులు సతీష్, పి.చక్రవర్తి, కె.విజయసాయి, ఆచంట ప్రకాష్, సుజాత, వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షత వహిస్తారన్నారు. నిడదవోలు మండలంలోని 23 గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు.

నేతాజీ సేవలు చిరస్మరణీయం

నిడదవోలు రూరల్: దేశానికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం సమిశ్రగూడెంలో ఆయన విగ్రహానికి మంత్రి దుర్గేష్ ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.